


మల్లాది రవిశంకర్

# నాలో నేను

రాత్రి రెండు గంటలు దాటుతున్నా, కంటి మీద కునుకు రావటం లేదు. మనసు మనసులో లేదు.

వివేకానికీ, వెర్రి మనసుకీ మధ్య కాన్ఫ్లిక్ట్.

ఇంత చదువు చదివి, ఇంత పొజిషన్లో ఉన్న నేనూ మామూలు మొగుడులాగానే ప్రవర్తిస్తున్నాననే వేదన. నేను చేస్తున్న పొరపాటు తెలిసి కూడా కరెక్ట్ చేసుకోలేని మామూలు మగాడిని.

బెడ్‌లైట్ వెలుగులో ఆదమరచి నిద్రపోతున్న రంజని ఒక పెద్ద మల్టీ నేషనల్ కంపెనీ సి.ఇ.ఓ. ఒకరోజు ఒక దేశంలో ఉంటే, ఇంకొకరోజు మరో దేశంలో ఉంటుంది తను. నెలలో దాదాపు ఇరవై రోజులు టూర్‌లోనే ఉంటుంది. ఎప్పుడూ మీటింగ్స్... బిజీ... బిజీ...

అరుదుగా మేము కలిసుండే అవకాశం ఈ రోజు వచ్చినా... అది నా మూర్ఖత్వంతో గడిచిపోయింది.

పాతికేళ్లుగా ఈ దేశంలోనే ఉంటూ, ఈ కంట్రీ సిటిజన్‌షిప్ తీసుకున్న నేనూ, రంజనీ బాగా ఎదిగామనే చెప్పాలి. నేను కన్సల్టెన్సీ లైన్ ఎంచుకుంటే, రంజనీ మార్కెటింగ్ లైన్ ఎంచుకుంది.

నా ఆలోచన పాతికేళ్ల క్రితంలోకి వెళ్లింది.

* * *

మొట్టమొదట నేనూ, రంజనీ ఇండోర్‌లో ఒక బిజినెస్ స్కూల్లో ఎం.బి.ఏ.లో క్లాస్‌మేట్స్‌గా కలిశాం. రంజని ఎక్కడుంటే అక్కడే సందడి. తను చాలా యాక్టివ్‌గా ఉండేది. దానికి పూర్తిగా భిన్నం నేను.

నాతో స్నేహం చెయ్యటానికి ఎక్కువమంది ముందుకొచ్చేవారు కాదు. నేనూ, నా చదువు, ఎప్పుడూ నా ప్రపంచంలో నేనుండేవాడిని.

అప్పట్లో ప్రతీ వీక్ ఏదో ఒక కార్పొరేట్ మీద, కార్పొరేట్ స్ట్రేటజీస్ మీదా ప్రజంట్ చెయ్యాల్సి ఉండేది. నా ప్రెజెంటేషన్‌లో కంటెంట్ ఉన్నా, ప్రెజెంటేషన్ స్కిల్స్ అంతా బాగుండేవి కావు.

రంజని ప్రెజెంటేషన్ అంటే ఎవరూ దాదాపు మిస్ అయ్యేవాళ్లు కాదు. పదిమందినీ నవ్విస్తూ... చాలా ఇంప్రెసివ్‌గా ఉండేది. అలాంటి రెండు విభిన్న మనస్తత్వాలున్న మా ఇద్దరికీ స్నేహం కుదిరింది.

తను గలగలా మాట్లాడేది. నేను అవునూ, కాదు అని చెప్పే మితభాషిని. ఇంటర్ బిజినెస్ స్కూల్ కాంపిటీషన్స్ అన్నిటికీ మా ఇన్‌స్టిట్యూట్ తననీ, నన్నూ ఒక టీమ్‌గా పంపేవారు.

పేపర్ నేను ప్రిపేర్ చేసేవాడిని. దాన్ని తను ప్రజంట్ చేసేది. ఎక్కడికెళ్లినా మా టీమ్‌కే ఫస్ట్ ప్రైజ్ వచ్చేది.

మా ఎం.బి.ఎ. చివర్లో ఇద్దరం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. దానికి ఎవరూ అడ్డు చెప్పకపోవటంతో మా పెళ్లీ, ఆ తర్వాత ఈ దేశం వచ్చి స్థిరపడటం జరిగిపోయింది.

నేను నాకు నచ్చిన కన్సల్టెన్సీలైన్ ఎంచుకున్నా. తను మార్కెటింగ్ అండ్ కార్పొరేట్ ఎక్విజిషన్స్ ఎంచుకొని పేరున్న ఒక కంపెనీలో జాయిన్ అయింది.

ఇండియా వదిలి రావటం తనకీ, తన పేరెంట్స్‌కీ కూడా అంత ఇష్టం లేదు కానీ నువ్వూ, నేనూ ఎదగాలంటే ఇలా నా ఊరూ, నా దేశం అంటూ పట్టుక్కూర్చుంటే లాభం లేదని పట్టుబట్టి ఇక్కడికి లాక్కొచ్చాను.

తను అంటుండేది... హాయిగా ఇండియాలో ఉంటూ, మీరు సంపాదిస్తుంటే కూర్చుని తినాలనిపిస్తోందని. కానీ దాన్ని నేనంత సీరియస్‌గా తీసుకోలేదు. అలా మొదలయింది ఈ దేశంలో మా జీవనయాత్ర.

ఈ పాతికేళ్లలో తను దాదాపు నాలుగు కంపెనీలు మారింది. ప్రతి కంపెనీలోను తనకి మంచి రికగ్నిషన్ వచ్చింది.

పెళ్లయిన కొత్తల్లో, చాలాకాలం పాటు ఆమె సక్సెస్‌కి గర్వపడేవాడిని. ఏ మేజర్ డెసిషన్ అవసరం తనకి కానీ, నాకు గానీ వచ్చినా, దాన్ని గురించి బాగా ఆలోచించి డెసిషన్స్ తీసుకునేవాళ్లం.

మేమిద్దరం కంబైండ్‌గా తీసుకున్న డెసిషన్స్ చాలా బాగా వర్కవుట్ అయ్యేవి. ఆమెకి మంచి పేరు తెచ్చిపెట్టేవి.

కానీ నా ఫీల్డ్ అలాంటిది కాదు. మేమిచ్చిన కన్సల్టెన్సీని మళ్లీ రివ్యూ చేసి మోడిఫై చేసేవాళ్లు చాలామంది ఉంటారు. ఫైనల్‌గా కంపెనీస్ మా కన్సల్టెన్సీని ఫాలో అయి డెసిషన్స్ తీస్కోవాలని లేదు. దానికి తోడు సీక్రెసీ ఎగ్రిమెంట్స్. ఎవరితో వాటిని డిస్కస్ చెయ్యకూడదు. దాంతో ఒక కన్సల్టెన్సీ రిజల్ట్ మెజర్ చేయటం కష్టం. దాంతో ఒక మంచి కన్సల్టెంట్‌గా మా ఫర్మ్‌లో నాకు పేరున్నా, ఆమె ఎదిగినంత ఫాస్ట్‌గా పబ్లిక్ కళ్లల్లో నేను ఎదగలేదు.

ఇలా అంచెలంచెలుగా ఎదుగుతూ ఆమె ఒక పెద్ద కంపెనీకి సి.ఇ.ఓ. అయింది. ఆమె ఎదుగుతున్నకొద్దీ, నన్ను ఒక కన్సల్టెంట్‌గా కంటే ఆమె భర్తగా గుర్తించటం మొదలుపెట్టింది నా చుట్టూ ఉన్న ప్రపంచం. నన్ను ఒక కన్సల్టెంట్ అని ఇంట్రడ్యూస్ చేసినా, వెంటనే రంజనీకి భర్తనని చెప్పటం మరచేవాళ్లు కాదు. అలా చెప్పగానే అవతలివారికి నామీద రెస్పెక్ట్ పెరిగిపోయేది.

గత కొద్దికాలంగా ఇది నన్ను చాలా బాధిస్తోంది. నా ఇగోని దెబ్బతీస్తోంది. ఒక కన్సల్టెంట్‌గా నన్ను వెనక్కి లాగుతోంది.

ఏదో అసంతృప్తి.


రంజనీ భర్తగా గుర్తింపు నాకు ముల్లులాగా గుచ్చుకుంటోంది. నా వివేకాన్ని, రాక్షసత్వం అధిగమిస్తోంది.

ఆమె సక్సెస్ నాలో జెలసీని పెంచుతోంది. దాంతో మేమిద్దరం ఎప్పుడు కలిసినా, ఏదో గొడవ పెట్టుకుని ఆమెని అవమానిస్తున్నాను. నా ఈ ప్రవర్తన నాకు చాలా అసహ్యంగా అనిపించినా, ఎందుకో మనసు మీద కంట్రోల్ తప్పుతోంది.

ఎకనామిక్ స్లో డౌన్ మా కన్సల్టెన్సీ బిజినెస్‌ని బాగా దెబ్బతీస్తోంది.

ఈ రోజు ఉదయం...

మా సి.ఇ.ఓ. పిల్చి- రంజనీతో మాట్లాడి కొన్ని కొత్త కన్సల్టెన్సీ ఎసైన్‌మెంట్స్ వచ్చేలాగా చూడమన్నాడు. బిజినెస్ గ్రోత్ మీదే మన ఫ్యూచర్ ఆధారపడిందని చెపుతూ, న్యూ బిజినెస్ తెస్తేనే నా ఉద్యోగం ఉంటుందని పరోక్షంగా చెప్పేశాడు.



ఉద్యోగం నిలవా లంటే... రంచినీని దేహీ అని అడ గాలా. వికృతంగా ఆలోచిస్తున్న మనసు "దాన్ని నేనడగటమేమి టని" పదే పదే ఉసికొల్పు తోంది.

అడక్కపోతే మరి ఈ ఉద్యోగం నిలవదేమో!

మనసు ఇలా పరిపరి విధాల ఆలోచి స్తున్న ఈ రోజే రంజనీ టూర్ నుండీ తిరిగొ చ్చింది. ఎప్పటిలాగానే గలగలా-మాట్లాడుతూ సంతోషంగా, చాలా నేచురల్‌గా ఉంది తను.

ఆమె ఎక్కడ ఏ దేశంలో ఉన్నా ఇంటిని నెగ్లెక్ట్ చేయదు. పిల్లల చదువుని రివ్యూ చేస్తుంది. నాతో కనీసం రోజుకి రెండుసార్లు విధిగా మాట్లాడుతుంది. కానీ ఈ రోజు నేనే తనతో చాలా రూడ్‌గా ప్రవర్తిం చాను. ఇంటిని అశ్రద్ధ చేస్తున్నావ్. ఉద్యోగం మాని ఇంట్లో కూర్చోమన్నాను.

ఆమె నన్ను వింతగా చూసింది.

"రెండు రోజుల తర్వాత ఇద్దరం మళ్లీ ఈ విషయం మాట్లాడదాం" అని మార్దవంగా, ముఖమ్మీది నవ్వు చెరక్కుండా చెప్పింది.

ఆమె ఈ నేచురల్ బిహేవియరే నన్ను పిచ్చివాడిని చేస్తోంది. నా జెలసీ ఆమెకి తెలిసిపోయిందేమో అనే అభిమానం. ఆమె నామీద లో ఒపీనియన్ ఏర్పర్చు కుంటుందేమో అనే అనుమానం. నేను భర్తననే ఇగో ఒకవైపు, ఆమె నాకంటే రోజురోజుకీ ఇలా ఎదిగిపో తుంటే, నాకు నేనే చిన్నవాడినైపోతున్నాననే భయం. ఆమె ముందు నేను తేలికవుతున్నాననే భావన. ఆమె నవ్వులో ఎగతాళి, ఎగసెక్కెం ఉందేమోననే అను మానం.

ఇలా నా మెంటల్ పీస్ పూర్తిగా పోతోంది.

ఆమె ముఖం చూడాలంటే భయం. కళ్లల్లోకి కళ్లు పెట్టి చూడాలంటే ఏదో జంకు.

కొన్ని సందర్భాల్లో ఆమెని చంపాలనే కోరిక. సుయిసైడ్ చేసుకోవాలనే ఆలోచన.

ఒకప్పుడు మేమిద్దరం క్లాస్‌మేట్స్. తర్వాత ప్రేమికులం. భార్యాభర్తలం.

ఇది జరిగిన పదిహేను రోజులు ఆమె టూర్‌లోనే ఉంది.

ఆ పీరియడ్‌లో చాలా మార్పులు వచ్చాయ్.

అనుకోకుండా మా ఫర్మ్‌కి మల్టీ బిలియన్ ఎసైన్ మెంట్స్ నాలుగు వచ్చాయ్. అవీ రంజనీ పనిచేస్తున్న కంపెనీ నుండి కావు. నాకు 'బెస్ట్ కన్సల్టెంట్ ఆఫ్ ద ఇయర్' అవార్డ్ ఒక ప్రిస్టేజియస్ మేగజైన్ నుండీ వచ్చింది. దాంతో పాటు నాకు మంచి పేరూ, నా టేలంట్‌కి మంచి రికగ్నిషన్ వచ్చింది.

నా సక్సెస్‌కి నాకంటే రంజనీనే బాగా సంతోషిం చింది. నా హేపీ మూమెంట్స్‌ని నిండు హృద యంతో షేర్ చేసుకుంది. సక్సెస్‌తో పాటు నాలో జెలసీ అనే రావణాసుర కాష్ఠం పూర్తిగా కాలి పోయి, నాలో ఉన్న టాలెంటెడ్ కన్సల్టెంట్ నిద్ర లేచాడు. నేనూ, రంజనీ ఒకరి సక్సెస్ ఒకరం షేర్ చేసుకుంటూ, ఒకర్ని ఒకరం గౌరవిం చుకోవటం మొదలుపెట్టాం.

రంజనీ టూర్స్ బాగా తగ్గించుకుంది.

ఈ ఈవెంట్స్ అన్నిటి వెనకాలా ఎవ రున్నారో తెలుసుకోలేనంత బిజీగా అయిపోయాను నేను.

'బిహైండ్ ఎవ్విరి మేన్స్ సక్సెస్, దేర్ హేజ్ టు బి ఏ లేడీ' అని గుర్తు చేసుకోలేనంత ఆనందంగా ఉన్నాను నేను.

○